క్లుప్తంగా

రూ.పది నాణేల వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

దేవరకొండ: అన్ని బ్యాంకుల్లో పది రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, అందరూ రూ.పది నాణేలను తీసుకోవాలని పట్టణంలోని డిండి చౌరస్తాలో గల ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ నక్క రాములు కోరారు. బుధవారం బ్యాంకు సిబ్బంది పది నాణేల వినియోగంపై పట్టణంలో అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాపారి పది రూపాయల నాణేలను తీసుకోవాలని, రిజర్వు బ్యాంకు సూచన మేరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలంయాదవ్, గడ్డం వెంకటయ్య, లోకసాని కృష్ణయ్య, సతీష్, వీరారెడ్డి తదితరులున్నారు.

నూతన కమిటీ నియామకం


మద్దూరి శ్రీను, కన్వీనర్


సతీష్‌కుమార్, కో కన్వీనర్

పెద్దవూర: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పెద్దవూర మండల కన్వీనర్‌గా పోతునూరు గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను, కో–కన్వీనర్లుగా మద్దూరి సతీష్ కుమార్, ముస్కు సతీష్‌ను నియమించారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు వారికి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అద్దంకి రవీందర్, చింతపల్లి బాలకృష్ణ, నంద యాదగిరి, నామ చక్రవర్తి, పెయ్యల గీత, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ కన్వీనర్‌గా రాములు


దేవరకొండలో రాములుకు నియామకపత్రం అందజేస్తున్న బుర్రివెంకన్న

దేవరకొండ: ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్‌గా జిల్లా రాములు నియామకమయ్యారు. బుధవారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న, జిల్లా కన్వీనర్ మద్దిమడుగు భిక్షపతి దేవరకొండలోని కార్యాలయంలో ఆయనకు నియామకపత్రం అంజేసి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ చేత స్థాపించబడిన ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్‌ను పూర్తి స్థాయిలో విస్తరింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క శోభా రాణి, చేకూరి రాజేష్, కండెల వెంకన్న, ఊరె సురేష్, వస్కుల అనిల్, మద్దిమడుగు నరేందర్, రాజ్ కుమార్, ఏసు, బాబు, రాజేష్, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రచారం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చింతపల్లి : టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని రెండోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కసిరెడ్డి కృష్ణారెడ్డి బుధవారం చింతపల్లి మండల పరిధిలోని గడియ గౌరారంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నీరుడు అంజయ్యతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటేశం, ఎన్. వెంకటేశ్వర్లు, బి.కృష్ణయ్య, శ్రీలత,వాణికుమారి, భాగ్యలక్ష్మి, హేమ, సువర్ణ, అన్నపూర్ణ, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

చింతపల్లి: చింతపల్లి మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.చింతపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కొడుదుడి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నల్ల కాశయ్య ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కిరణ్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వింజమూరి కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నియోజకవర్గం ఇన్‌చార్జి యాదగిరి, నాయకులు అరగంటి యాదయ్య ,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అరగంట జంగయ్య, మాసన పెద్దయ్య, ఇరిగి శేఖర్, వెంకటరమణ, నల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు

‘ఏఎమ్మార్పీ’ మరమ్మతులకు మోక్షం

- ప్రాజెక్టు కాల్వల్లో కంపచెట్లు, బండరాళ్ల తొలగింపు
- చివరి భూములకు చేరుతున్న నీరు
- నీటి నిలిపివేత అనంతరం పూడికతీత పనులు
- కాల్వల హద్దులకు ట్రెంచ్‌ల తవ్వకం


కంపచెట్లు తొలగించిన డి-25 కాల్వ


డి-22 కాల్వలో చెట్లను తొలగిస్తున్న జేసీబీ

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండేళ్లుగా నీరు లేక కంపచెట్లు, పూడికతో నిండిన కాల్వలు ప్రస్తుత సీజన్‌లో నీటి విడుదల జరిగినా పారక రైతులు ఆందోళన చెందారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకు వెళ్లడంతో కాల్వల మరమ్మతులపై దృష్టి సారించారు. మేజర్ కాల్వలన్నింటిలో కంపచెట్ల తొలగింపునకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రెండు నెలలుగా నీటి విడుదల జరుగుతున్నా మేజర్ కాల్వల్లో సగానికి కూడా చేరని నీరు కంపచెట్ల తొలగింపుతో చివరి భూములకు చేరుతుంది. ప్రస్తుతానికి కంపచెట్లు, అడ్డుగా ఉన్న బండ రాళ్లను తొలగించగా కాల్వలకు నీటి విడుదల నిలిపివేయగానే పూడికను తొలగించనున్నారు. మండలంలో డి–23, డి–24 కాల్వలు 1994లో తవ్వగా అప్పటినుంచి పూడిక తీయలేదు. గతంలో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో మాత్రమే కంపచెట్లను తొలగించారు.

గుర్రంపోడు మండలంలో 40 కిలోమీటర్ల మేర..

గుర్రంపోడు మండలంలో డి–19 నుంచి డి–25 వరకు ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. డి–19 మేజర్ 12 కిలోమీటర్లు, డి–20 మేజర్ 5 కిలోమీటర్లు, డి–21 మేజర్ 2 కిలోమీటర్లు, డి–22 మేజర్ 16 కిలోమీటర్లు, డి–23 కాల్వ 3 కిలోమీటర్లు, డి–24 మేజర్ 5.5 కిలోమీటర్లు, డి–25 మేజర్ 8 కిలోమీటర్లు, డి–14 ఆర్ కాల్వ 9 కిలోమీటర్ల దూరం ఉండగా వీటిన్నంటిలో కంపచెట్ల తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఆక్రమణలతో సమస్యలు

కాల్వలకు రెండు వైపులా గల రహదారులను పక్క రైతులు చాల చోట్ల ఆక్రమణలకు పాల్పడటంతో కంపచెట్ల తొలగింపునకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. తొలగించిన కంపచెట్లను పక్కన వేయడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరిపంట కోతలు ముగిసి, కాల్వలకు నీటి విడుదల నిలిపి వేయగానే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. కాల్వల వెంట ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హద్దును ఏర్పాటు చేసేలా చిన్న ట్రెంచ్ కాల్వలను తవ్వనున్నారు. ఈ ట్రెంచ్‌ల వల్ల కాల్వల పక్క రైతులు దారి లేకుండా ఆక్రమించుకునే అవకాశం ఉండదు.

మైనర్ కాల్వల్లోనూ కంపచెట్లను తొలగిస్తే..

మండలంలో 150 కిలోమీటర్ల మేర మైనర్ కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వలు చాలా చోట్ల ఆనవాళ్లు లేకుండా ఉన్నాయి. ఈ కాల్వల్లోనూ కంపచెట్లను తొలగిస్తేనే పూర్తి స్థాయిలో స్థిరీకరించిన మేరకు ఆయకట్టుకు నీరు అందుతుంది. వీటిని భవిష్యత్తులో ఉపాధిహామీ ద్వారా కంపచెట్లను తొలగింపునకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

చివరి భూములకు నీరు చేరుతోంది



కంపచెట్లను తొలగించిన కాల్వల్లో చివరి భూముల వరకు నీరు చేరుతుంది. కంపచెట్లు మూసుకుని పోయి ఉన్న కాల్వలు నేడు శుభ్రంగా మారి నీటి గలగలల సవ్వడి వినిపిస్తుంది. నీటి ప్రవాహ వేగం పెరిగింది. మైనర్ కాల్వల్లోనూ కంపచెట్లు తొలగించాలి.

– నామాల సురేందర్, రైతు, మొసంగి

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరు



నూతన కార్యవర్గంతో రాపాక సాయికుమార్

మిర్యాలగూడ టౌన్ : విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి రాపాక సాయికుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఏబీవీపీ నగర నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ ఏబీవీపీ నగర నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శిగా బొల్లెపల్లి మధు మోహన్‌రాజు, మహిళా కన్వీనర్‌గా ప్రణవి, కో కన్వీనర్‌గా అశ్విని, జాయింట్ సెక్రటరీగా కీర్తి, సీరి, వంశీ, స్పోర్ట్స్ ఇంచార్జిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలుగా మల్లేశ్వరీ, శ్రీ విద్య, అభి, మధు, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా యశ్వంత్, కళామంచ్ కన్వీనర్‌గా విజయ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రియాంక, హర్షిణి, తేజశ్రీ, సౌమ్య, మనోజ్, గణేష్, దయాకర్‌ను ఎన్నుకున్నారు.

భూ పట్టాలను రద్దు చేయడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

మిర్యాలగూడ : సీలింగ్ భూముల పేరిట పట్టాలను రద్దు చేయడం సరికాదని రైతులు రామాంజనేయులు, వింజం ముసలయ్య, సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దామరచర్ల మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని సర్వే నెం.67లో 14.28 ఎకరాల పట్టాభూమి 1991–92 నుంచి రెవెన్యూ రికార్డుల్లో, పహాణీ, ధరణిలోనూ పట్టాగా నమోదై ఉన్న భూమిని 2022లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. తాళ్లవీరప్పగూడెంలో జమ్మిగుంపుల దుర్గయ్య వద్ద కొనుగోలు చేసిన 2.25ఎకరాల సీలింగ్ భూములుగా చూపి ఏకపక్షంగా పట్టాలు రద్దు చేయడం దారుణమన్నారు. నిన్నటి వరకు ధరణిలో పట్టాభూమిగా ఉన్న సర్వే నెం.67లోని భూమి నేడు ప్రభుత్వ భూమిగా మార్చారని వాపోయారు. కనీసం నోటీసులు కూడా జారీ చేయకుండా పట్టాలను రద్దు చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

ఓటు.. వజ్రాయుధం లాంటిది


మాట్లాడుతున్న తహసీల్దార్ సరోజ పావని

పెద్దవూర: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ సరోజ పావని అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఎమ్మెల్సీ నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంఈఓ తరి రాములుతో కలిసి పెద్దవూర, పులిచర్ల, వెల్మగూడెం , పెద్దగూడెం జెడ్పీహెచ్ఎస్‌తో పాటు మండల కేంద్రంలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించా రు. ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని అన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మారం రవీందర్, సత్యనారాయణ, నారా యణరెడ్డి, జ్యోత్స్న, ఉపాధ్యాయులు గుంటుక రామాంజిరెడ్డి, హిమవంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, శకుంతల పాల్గొన్నారు.

పెన్షనర్లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతమ్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా కార్మికులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండిగ్‌లో ఉన్న ఐదు డీఏ లను విడుదల చేయాలని, ఖజానా శాఖ ద్వారా బిల్లులను అందజేసి, పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. జీఓ 317ను సమీక్షించి బాధితుల ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా చంద్రారెడ్డి, పల్లా భిక్షం, కృష్ణయ్య, యేసు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే భూ పట్టాలు రద్దు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ : మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుపై రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కొత్తపల్లి రెవెన్యూ తాళ్లవీరప్పగూడెం వద్ద సర్వే నంబర్లు 66, 67లలో గల భూముల పట్టాలను ఏకపక్షంగా రద్దు చేశారని దామరచర్ల మండల బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఆంగోతు హాతీరాం, సోము సైదిరెడ్డి, కోటిరెడ్డి మాట్లాడారు. పట్టాదారులైన అంబటి రామాంజనేయులు, సాధినేని శ్రీనివాస్ రావు, వింజం ముసలయ్యకు చెందిన 14.28 ఎకరాలను నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా రెవెన్యూ అధికారులు ధరణిలో నుంచి తొలగించి సీలింగ్ భూములుగా పేర్కొనడం అవాస్తవమన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపాలని వారు డిమాండ్ చేశారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌కు సన్మానం


మార్కెట్ ఛైర్మన్ , వైస్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

హాలియా : హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్‌ను బుధవారం స్థానికంగా పెద్దవూర, హాలియా, తిరుమలగిరి (సాగర్) మండలాల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఆయా మండలాల బాధ్యులు మన్నెం వెంకటేశ్వర్లు, రమావత్ కృష్ణ, వడ్త్యా రాజు, చెన్ను వెంకట్ రెడ్డి, మచ్చ సునిత, కట్టెబోయిన సైదయ్య, సీనియర్ నాయకులు బాణాల వెంకటేశ్వరరావు, కోడుమూరు వెంకటరామిరెడ్డి, కరుముల శ్రీనివాస్‌రెడ్డి, చింతపల్లి రవీందర్, మద్దెల ప్రసాద్, ప్రశాంత్, షేక్ షర్ఫొద్దీన్, వీరాసింగ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా


చింతపల్లి: సీమంతం వేడుకలో పాల్గొన్న సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం

కొండమల్లేపల్లి : ఆలిండియా సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం సభ్యులు బుధవారం కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల గ్రామ పంచాయతీని సందర్శించారు. శిక్షణలో భాగంగా గ్రామంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘ బంధ గ్రూపులతో, గ్రామంలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపునకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శి ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం

చింతపల్లి: మండలంలోని జర్పులతండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ వేడుకల్లో సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం ఉత్సాహంగా పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించింది. సీమంతం జరుపుకున్న గర్భిణులను బృందం సభ్యులు ఆశీర్వదించారు.

నిడమనూరు, త్రిపురారం మండలాల్లో వర్షం

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చే సమయంలో వరి పైరు నేలవాలింది. త్రిపురారం, నర్లకంటిగూడెం, సీలాయిగూడెం, కొణతాలపల్లి ,బాబుసాయిపేట, బెజ్జికల్, అప్పలమ్మగూడెం, బొర్రాయిపాలెం గ్రామాల్లో పంట నష్టం అధికంగా ఉంది. పలు గ్రామాల్లో పత్తి పంటకు కూడా నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు.అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు.

వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలు

వేములపల్లి(మాడ్గులపల్లి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో పంట పొలాలు నేలవాలాయి. మండలంలో రైతులు సుమారు 32వేల ఎకరాల్లో పత్తి, 9,900 ఎకరాల్లో వరి సాగు చేయగా వర్షానికి సుమారు 450 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం ఏఓ శివకుమార్ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓలు ఉన్నారు.

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను రానున్న రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు.బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందుకు గాను త్వరలో అవసరమైన టీబీఎం మిషన్ అమెరికా నుంచి తెప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో డిండి లిఫ్ట్ స్కీం పనులను కూడా పూర్తి చేసేందుకు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డితో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో బీటి రోడ్ల నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సంజీవరెడ్డి,ఎంఏ సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, నాయిని మాధవ రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, నల్లగాసు జాన్ యాదవ్, మారుపాకల సురేష్‌గౌడ్, రుక్మారెడ్డి, రాంసింగ్ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని త్రిలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, పొన్నెబోయిన సైదులు, నాయిని మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, ఆమంచ అంజయ్య, భూషరాజు రాములు, రాంబాబు, మోహన్, రాచనూరి రమేష్, హరి, అనిల్, లింగయ్య, మల్లేష్ తదితరులున్నారు.

పోలీస్‌శాఖ పనితీరుపై విద్యార్థులకు అవగాహన


త్రిపురారం : విద్యార్థులతో హాలియా సీఐ జనార్దన్ గౌడ్ తదితరులు


చింతపల్లి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదయ్య


మిర్యాలగూడలో అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జున, ఇతర పోలీస్ సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున వివిధ పాఠశాలల విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరు, విధుల్లో భాగంగా ఉపయోగించే ఆయుధాలు వాటి పని తీరును వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

చింతపల్లి : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ పనితీరుపై బుధవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై భీమనమోని యాదయ్య పోలీస్‌స్టేషన్లో ఉన్న రిసెప్షన్ కౌంటర్ నుంచి జిల్లా శాఖ సంబంధించిన వివరాలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.విద్యార్థులతో సెట్‌లో మాట్లాడించారు.విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు సుందరయ్య, వెంకటయ్య ఎల్ వినోద్, కృష్ణ, రవి కానిస్టేబుల్ సైదయ్య, సునీత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

త్రిపురారం : పోలీసుల విధులు, న్యాయ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హాలియా సీఐ జనార్దన్ గౌడ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలు, వాటిని అరికట్టడంలో యువత పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎస్ఐ వై ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కందిమళ్ల ధామోదర్, మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయపురి పోలిస్టేషన్‌లో ఓపెన్ హౌజ్

నాగార్జునసాగర్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విజయపురిటౌన్ పోలిస్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలిస్టేషన్ సందర్శన, పోలీస్ వ్యవస్థ పనితీరు, విధుల్లో భాగంగా ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు డయల్100, షీటీమ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కొండమల్లేపల్లి : విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆకాంక్షించారు. కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న 54 మంది విద్యార్థులకు బుధవారం ఆయన మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడు మృతి

కొండమల్లేపల్లి : ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందాడు. కొండమల్లేపల్లి పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం జూనూతల గ్రామపంచాయతీ గాసీరాంతండాకు చెందిన మెగావత్ జాను (70) బుధవారం మధ్యాహ్నం తండా నుంచి కొండమల్లేపల్లికి వచ్చాడు. పెద్దవూర మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లడానికి స్థానిక చౌరస్తాలో ఆటో ఎక్కాడు. ఆ ఆటోలో కొద్ది దూరం ప్రయాణం చేసిన జానునాయక్ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆటో డ్రైవర్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

స్టేజీ నిర్మాణానికి భూమి పూజ

నాగార్జునసాగర్: నందికొండ పైలాన్‌కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టేజీ నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. బిగ్‌హెల్ప్‌ఫర్ ఎడ్యుకేషన్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు స్టేజీ నిర్మాణానికి అయ్యే ఖర్చంత భరించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషు, అమ్మాదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు రాజబాబు, విమల, లాలు, అంజయ్య, శ్రీనివాసరెడ్డి, వరలక్ష్మి, రాజేష్‌కుమార్, నరేష్, కాంట్రాక్టర్ గుజ్జల కొండలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని గ్యారకుంటపాలెంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగయ్య, స్వాగత్ రావు, నాగమణి, పుల్లమ్మ, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్యారకుంటపాలెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం చంద్రశేఖర్

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యారోగ్య శాఖ స్టాటిస్టికల్ అధికారి కృష్ణ

వేములపల్లి: గర్భిణులు, చిన్నారులకు తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ స్టాటిస్టికల్ అధికారి కృష్ణ వైద్యులకు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని, శెట్టిపాలెం ఉపకేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, మాజిద్‌అలీ, శాంతమ్మ తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఫణికుమార్

దేవరకొండ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ–టీఎస్ కృషి చేసస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వి.ఫణికుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్టీయూ–టీఎస్ ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్, పదోన్నతులు, బదిలీలు,సర్వీస్ పెంపునకు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొర్ర లోక్యానాయక్, దారం దామోదర్, ఓరుగంటి శ్రీనివాసులు, సాయిలు, మున్నా నాయక్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగవాణి, జయ, లక్ష్మయ్య, సైదులు తదితరులున్నారు.